


**అప్పుడే స్నానం చేసి ఆకు పచ్చ ఆర్గండీ చీరపై అదే రంగు బ్లవుజు వేసుకుని జుత్తు విరబోసుకుని ఫ్లవర్ వాజులో పూలగుత్తులమ ర్చుతున్న కళ్యాణి చూడ్డా నికి వనదేవతలా వుంది.**

తెరచి వున్న తలుపుల మధ్య నుంచి లోనికి అడుగుపెట్టిన లత కళ్యాణిని అబ్బురంగా చూస్తూ పలకరించడం కూడా మరిచి పోయింది.

వెనక్కు తిరిగిన కళ్యాణి లతను చూసి ఆశ్చర్యపడి, ''అదే మిటే, అలా మాటామంతీ లేకుండా నిలబడిపోయావు, ఎప్పు డొచ్చావ్?'' అంది.

లత, కళ్యాణి కాలేజిలో క్లాసుమేట్సు. లతకా ఊళ్ళో చుట్టాలున్నారు.

''ఎనిమిదింటికి వచ్చాను. వచ్చింది చుట్టా లింటికే అయినా వున్న పని నీతోనే కనుక పదింటికల్లా యిక్కడ వాలాను'' అంది లత.

''రా, కూర్చో! చల్లకొచ్చి ముంత దాచి నట్లు కాక నీ పనేంటో సూటిగా చెప్పు'' అంది కళ్యాణి.

''అన్నయ్య యింకా పెళ్ళి చేసుకోలేదు. ఎందుకో నీకు తెలుసు'' అంది లత.

''నీకు పెళ్ళికాని అన్నయ్యున్నట్లు నాకు తెలియదే!'' అంది కళ్యాణి ఆశ్చర్యం నటిస్తూ.

''నీకు వాడి పెళ్ళి మాత్రమే గుర్తుం టుంది. ప్రేమ గుర్తుండదు'' అంది లత నిట్టూర్చి.

లత కొక్కడే అన్నయ్య. పేరు ప్రకాష్. లత కారణంగానే కళ్యాణి అతడికి పరిచయ మయింది. ఇద్దరూ గాఢంగా ప్రేమించు కున్నారు. ఒకర్ని విడిచి ఒకరు బతకలేమను కున్నారు. ఆ సమయంలో ప్రకాష్ మరదలు సంధ్యకు అతడంటే ప్రాణమని తెలిసింది. ఆమెకు కాన్సరు. బ్రతికే ఆశ లేదు. డాక్టర్లు ఏడాది గడువిచ్చారు.

సంధ్యకు బావను పెళ్ళి చేసుకోవాలని ఒకే ఒక్క కోరిక. మృత్యుముఖంలో వున్న ఆ అభాగ్యురాలి కోరికను ప్రకాష్ కాదనలేక పోయాడు. కానీ ఈ పెళ్ళికి కళ్యాణి ససేమిరా అంది. ప్రకాష్ ప్రేమను త్యాగం చేశాడు. పెళ్లయిన రెండు మాసాలకే సంధ్య పోయింది. చాలామంది ప్రకాష్‌ను పెళ్ళయిన వాడిగా కాక త్యాగమూర్తిగా గుర్తుంచుకున్నారు. అతడికి విప రీతంగా పెళ్ళి సంబంధాలు వస్తున్నాయి.

''ప్రేమను త్యాగం చేసి పెళ్ళి చేసు కున్నాడు. ఆ పెళ్ళిని త్యాగం చేసి మళ్ళీ పెళ్ళం

## మార్కెట్‌లో కొత్తగా 'మీరా హెర్బల్ షీకాకాయ్ పౌడర్'

దక్షిణాది ప్రజలకు సుపరిచితమైన 'చిక్' షాంపును తయారుచేస్తున్న బ్యూటీ కాస్మెటిక్స్ అనే సంస్థ మార్కెట్లో కొత్తగా "మీరా హెర్బల్ షీకాకాయ్ పౌడర్"ను ప్రవేశపెడుతున్నది. ప్రకృతి మూలికలతో తయారైన ఈ "మీరా హెర్బల్ షీకాకాయ్ పౌడర్" జుట్టును పరిశుభ్రంగా వుంచి, చుండ్రును శాశ్వతంగా నిర్మూలిస్తుందని, జుట్టుకు పూర్తి రక్షణ కల్పిస్తుందని ఆ సంస్థ ఒక ప్రకటనలో తెలిపింది.





టున్నాడు. మగాళ్ళ కెలాగైనా సాగుతుంది!" అంది కళ్యాణి నిట్టూర్చి.

"ఆడదానిగా నీకు మాత్రం ఏం తక్కువ యింది? అన్నయ్య నిన్నే పెళ్ళి చేసుకుంటా నని భీష్మించుక్కూర్చున్నాడు."

కళ్యాణి కళ్ళు ఎర్రబడ్డాయి, "కీర్తి ప్రతిష్ఠల మైకంలో నీ అన్నయ్య ప్రేమను మరిచిపోవచ్చు. కానీ నాకు పెళ్ళయిందన్న విషయం మరిచి పోవద్దను"

"పెళ్ళి! నీదీ ఒక పెళ్ళేనా! అన్నయ్యమీద అక్కసుకొద్దీ వెనకాముందూ చూడకుండా నిర్ణయం తీసుకుని గణపతిని పెళ్ళి చేసుకున్నావు. అతడికి నీ డబ్బుమీదే కానీ నీమీద మోజు లేదని నీకు తెలియదా?"

కళ్యాణి సోఫాలో వెనక్కు జారగిలబడి, "ఎంత డబ్బున్నా మన సమాజంలో ఆడదానికి భర్త పేరుతో మగతోడు అవసరం. అందుకే పెళ్ళి! అంతేకానీ పెళ్ళి పేరుతో మగాడు ఆడదాన్ని సుఖపెడతాడనుకుంటే అది భ్రమ. పెళ్ళికి ముందు కీర్తిప్రతిష్ఠల కోసం ప్రేమను త్యాగం చేయగలవాడు పెళ్ళి తర్వాత మరి దేని కోసమో ఆ ప్రేమను త్యాగం చేయడన్న నమ్మకం లేదు. కొందరికి విలాస జీవితంపై మోజు. మరికొందరికి కీర్తిప్రతిష్ఠలపై మోజు. నా ఊహలో ప్రకాష్‌కీ, గణపతికీ తేడా లేదు. ఇద్దరూ కూడా భార్యనుకాక వేరే దేన్నో ప్రేమిస్తారు. అందుకే నా నిర్ణయం పట్ల విచారం, జీవితం పట్ల అసంతృప్తి నాకు లేవు" అంది.

"అన్నయ్యనీ గణపతినీ పోలుస్తావా? ఇద్దరికీ హస్తిమశకాంతరమని తెలియదా నీకు?"

ఆ కీర్తి గర్వంతో నాకేమీ ఇవ్వకుండానే నేను తనని ఆరాధించాలనుకుంటాడు.

"ఇలాగన్నావు కాబట్టే గణపతే ప్రకాష్ కంటె మెరుగని నేనంటాను. గణపతికి నా కారణంగా డబ్బొచ్చింది. అందుకని అతడికి నేనంటే కృతజ్ఞత. డబ్బంతా నా అదుపులో వుంది. ఆ కారణంగా అతడికి నాపట్ల గౌరవం. నేను నిప్పులాంటి దాన్నయితే తనొక ఎంగిలి పీక. కాబట్టి అతడికి నేనంటే భయం. అన్నింటికీ నామీద ఆధారపడ్డ కారణంగా అతడు నాపట్ల ప్రేమను నటిస్తాడు. ఇక ప్రకాష్ అంటావా, అతడు నా కోసం కాక పదిమందిలో పేరుకోసం జీవిస్తాడు. నాకు ప్రేమను దూరం చేసి తను ఉత్తముడిగా గౌరవించబడతాడు. అతడి కారణంగా అన్నీ విధాలా అసంతృప్తికి గురవుతూ సమాజం నుంచి కూడా రవంత సానుభూతికి నోచుకోని జీవితమవుతుంది నాది!"

"నువ్వు ఆలోచించకుండా మాట్లాడుతున్నావని నాకు అర్థమయింది. కానీ అన్నయ్యెప్పుడూ నీ గురించే ఆలోచిస్తూంటాడు. గణపతి భార్యగా నీకు రక్షణ లేదని వాడి గట్టి నమ్మకం. విడాకులకు సాక్ష్యాధారాలు కూడా సంపాదించాడు. కావాలంటే నువ్వూ చూడవచ్చు" అంటూ లత తన వానిటీ బ్యాగులోంచి చిన్న ప్యాకెట్ అందించింది.

అందులో నాలుగు ఫోటోలు, మూడుత్తరాలు వున్నాయి.

గణపతికి సుభద్ర అనే యువతితో పెళ్ళిలాంటి అనుబంధ మున్నదని అవి రుజువు చేస్తాయి. ఆ అనుబంధం పెళ్ళికి ముందే వుండి యిప్పటికీ కొనసాగుతోంది. 'అసలు గణపతి కళ్యాణిని పెళ్ళి చేసుకుందుక్కారణం సుభద్ర కేదో అంతు తెలియని వ్యాధి రావడం. దానికి వైద్యానికి బాగా డబ్బు కావాలి.

ఈ వివరాలు కళ్యాణికి తెలియవు. ఆమె ఆశ్చర్యంగా, "ప్రకాష్‌కివన్నీ ఎలా తెలిశాయి? ఏదైనా డిటెక్టివ్ ఏజన్సీ ప్రారంభించాడా?" అంది.

"మనసుంటే మార్గముంటుంది. వాడికిటీవలే తెలిసిన విశేషం ప్రకారం గణపతి నిన్ను చంపాలనుకుంటున్నాడు."

"చంపితే అతడికేం లాభం? బంగారు గుడ్లు పెట్టే బాతు నెవరైనా చంపుకుంటారా?" అంది కళ్యాణి. ఆమె మామూలుగా అనాలని ప్రయత్నించినప్పటికీ ముఖానికి చెమటలు పట్టాయి.

"మూర్ఖులు చంపుకుంటారని నీతి కథ చెబుతోంది" అంది లత.

కళ్యాణి ఆలోచనలో పడింది.

"ఎక్కువగా ఆలోచించకు. నా మాట విను. నీకేదైనా అయితే అన్నయ్య భరించలేడు. విడాకులు తీసుకుందుకు అన్నయ్య నీకు అన్ని విధాలా సహకరిస్తాడు. మీరిద్దరూ పెళ్ళి చేసుకుని సుఖంగా జీవించండి."

"నీ అన్నయ్య సంగతలాగుంచు. నా సుఖం గురించి నీకెందుకో అంత ఆసక్తి?" అంది కళ్యాణి.

"ఏమో మరి! మీ యిద్దర్నీ కలపాలని నేను మావారిని విడిచిపెట్టి నీదగ్గర కొచ్చాను. ఆయన నన్ను విడిచి ఒక్క క్షణం కూడా వుండలేరని నీకూ తెలుసు" అంది లత.

క్షణం పాటు కళ్యాణి కళ్ళలో అసూయ. ఆమె భర్త గణపతి నెలకు రెండు వారాలు ఊళ్ళోనే వుండడు. ప్రస్తుతం వారం రోజులుగా ఊళ్ళో లేడు.

"ఏమాలోచించావే?" అంది లత మళ్ళీ.

"ఆలోచించడానికేం లేదు. నన్ను బాధపెట్టిన వాళ్ళకు నా ఉసురు తగుల్తుంది. అన్నింటికీ దేవుడే వున్నాడు" అంది కళ్యాణి.

కోరమాండల్ సిమెంట్స్ లిమిటెడ్ వారి భీమ సిమెంట్

ఆ మాటలు తన అన్న నుద్దేశించి అందో లేక గణపతి గురించో నిర్ధారణ చేసుకోలేక పోయింది లత. వెళ్ళిపోయేటప్పుడామె, "నీకు పెళ్ళై రెండేళ్ళయిందంటే నమ్మడం కష్టం. ఇప్పటికీ పదహారేళ్ళ పాపలా వున్నావు" అంది.

2

రాత్రి పది గంటలకు వచ్చాడు గణపతి. కళ్యాణి అతణ్ణి ముభావంగా పలకరించింది.

"రోజులు గడిచిపోతున్నాయి. వ్యాపారం ఒక్కడుగు కూడా ముందుకు వెళ్ళడం లేదు" అన్నాడతడు తనే సంజాయిషీ యిస్తూ.

అతడు వ్యాపారం పేరు చెప్పి నెలకు పది వేల దాకా భార్య నుంచి తీసుకుంటాడు. ఎక్కడెక్కడో తిరిగి వస్తాడు.

కళ్యాణికి డబ్బు బాధలేదు.

ఆమెకు బ్యాంకులో పది లక్షల రూపాయిల డిపాజిట్లున్నాయి. అవికాక లక్షల షేర్లు వివిధ కంపెనీల్లో వున్నాయి. డివిడెండ్ల మీదే ఆమెకు నెలకు ఇరవై వేలు దాకా వస్తుంది. పదెకరాల పొలముంది. ఊళ్ళో ఒక సినిమా హాలు ఆమె పేరుమీదే వుంది. నాలుగు టాక్సీలు ఆమె స్వంతం. ఇవన్నీ కాక తండ్రి ఆమెకు ఏటా లక్ష రూపాయిలు కానుకగా యిస్తుంటాడు.


కళ్యాణికి ఒక అక్క, అన్న, ఇద్దరు తమ్ముళ్ళు వున్నారు. డబ్బుకు లోటు లేదు కానీ యింట్లో ఎవ్వరికీ ఒకరినొకరు పలకరించుకునే తీరుబడి వుండదు. ఎవరి గొడవ వారిది, ఎవరి హడావుడి వారిది.

అందుకే ప్రకాష్ ప్రేమకు ఆమె త్వరగా కరిగిపోయింది. ఆ ప్రేమ దూరమైతే భరించ లేక తొందరపడి గణపతిని ఎన్నుకుంది. తండ్రి ఆమె మాట కాదనడు. తల్లి ఆమెకు నీతులు చెప్పదు.

గణపతి కళ్యాణికి నచ్చలేదు. కానీ సరిపెట్టు కుందుకు ప్రయత్నిస్తోంది. అతడి లోపాల్ని ఒప్పుకుందుకామె అహం కూడా అడ్డు వస్తుంది.

అయితె గణపతి ఆమెకు భర్తలా కాక సేవ కుడిలా అణిగిమణిగి వుంటాడు. ఆమె నెప్పుడూ మాటలతో చేతలతో బాధించడు. అతడికి వ్యక్తిత్వం లేదనడానికి లేదు. కానీ ఆ వ్యక్తిత్వం కళ్యాణి ముందు బయటపడలేక పోతోంది.

గణపతికీ ఈ జీవితం నచ్చలేదు. అతడు సుభద్రను ప్రేమించాడు. సుభద్ర కళ్యాణి అంత అందగత్తె కాదు. ఆమె నా అన్నవాళ్ళెవ్వరూ లేని సామాన్య మధ్యతరగతి మనిషి. ఓ




చిన్న కంపెనీలో స్టెనోగా పని చేస్తూ పొట్ట పోసుకుంటోంది. ఆమె గణపతిని ప్రేమించింది. అతణ్ణి పూర్తిగా నమ్మింది. వాళ్ళిద్దరికీ గుళ్ళో పెళ్ళయింది.

లోకం దృష్టిలో కళ్యాణి తన భార్య అయినప్పటికీ సుభద్రకు మాత్రమే భర్తగా ఫీలవుతాడు గణపతి. అందుకే నెలకు రెండు వారాలు ఆమెతో గడిపి తన వ్యక్తిత్వానికి తృప్తిని కలిగించుకుని కళ్యాణి వద్దకు వస్తాడు. వ్యాపారం చేస్తానని కళ్యాణి వద్ద డబ్బు తీసుకుంటాడు. ఆ డబ్బేం చేశావని కళ్యాణి అడగదు. అయినా తనే ఏదో సంజాయిషి యిస్తాడు. కళ్యాణి అతడి సంజాయిషి విని నవ్వి వూరుకుంటుంది. తప్పుచేసి దొరికిపోయిన గారాల అల్లరిపిల్లాడిని చూసి తల్లి నవ్వినట్లుంటుందా నవ్వు.

గణపతికి కళ్యాణి డబ్బుమీద ఆశ వుంది. ఆమెను చంపాలన్న ఆశయమూ వుంది. అయితే, అంతా చట్టం పరిధిలో జరగాలని ఆగుతున్నాడు. ఎదురు చూసేవాడికి అవకాశం దొరక్కపోతుందా?

"ఎందుకు నీకీ వ్యాపారం పిచ్చి?" అంది కళ్యాణి.

"నాకు నేనుగా సంపాదించాలని" అన్నాడు గణపతి.

"గణపతీ!" అంది కళ్యాణి ప్రేమగా, "సంపాదన గురించి నువ్వు బెంగపెట్టుకోకు. నా డబ్బంతా ఎవరి కోసం?"

"నేను సంపాదించి దాంతో నీకేదైనా కొనగలిగితే నాకు ఆనందం"

"కానీ నువ్వు నా ఎదుట వుంటేనే నాకు ఆనందం" అంది కళ్యాణి.

గణపతి తల వంచుకున్నాడు.

"గణపతీ! నాకేమిటో భయంగా వుంటోంది. కొంతకాలం పాటు వ్యాపారం గురించి మరిచిపోయి నా దగ్గరే వుండిపో" అంది కళ్యాణి.

ఆమె గొంతులో అహంకారానికి బదులు అర్థింపు వినబడి ఆశ్చర్యంగా ఆమె వంక చూసి "ఏమయింది?" అన్నాడు గణపతి.

"రోజూ ఉదయం, సాయంత్రం భరించ లేని విధంగా తలబద్దలైపోతుంది. మధ్యాహ్నాలు కడుపులో పేగులు మెలిపడినట్టు ఒకటే బాధ. రాత్రిళ్ళు నిద్ర సరిగా పట్టదు"

గణపతి తెల్లబోయి ఆమెవంక చూశాడు.

"డాక్టర్ని కలిశాను. దీనికి మందు లేదన్నాడాయన. ఏదో పెద్ద పేరు చెప్పి ఆరోగం నాకు వచ్చిందన్నాడు. అదృష్టం బాగుంటే దానంతటదే తగ్గిపోవచ్చుట. అదృష్టం బెడిసి కొడితే ఆర్నెల్లలో ప్రాణంపోవచ్చుట."

"నో" అన్నాడుగణపతి కంగారుగా.

అతడలాగనడానికి కారణం కళ్యాణికి తెలుసు. అందుకే ఆమెకు సంతోషం, అసంతృప్తి ఒక్కసారే కలిగాయి.

"దీనికి ఏదో ఒక మందుండకపోదు. మరో డాక్టర్ని చూద్దాం" అన్నాడు గణపతి ఆమె వంక అనుమానంగా చూస్తూ.

"పని చేస్తే ఏదైనా విషం పని చేయొచ్చుట" అంది కళ్యాణి.

"అంటే?"

"చందమామలో కథ చదవలేదూ? ఓ

గుడ్డివాడికి విషం పెడితే చూపు వచ్చిందట......" అంది కళ్యాణి.

"అలాగని విషం తింటావా?" ఆశను కంగారుగా మారుస్తూ అడిగాడు గణపతి.

కళ్యాణి తల అడ్డంగా ఊపి, "నాకు జీవితం మీద ఆశ వుంది. నా అదృష్టం మీద నమ్మకముంది. నీతో కలకాలం హాయిగా వుండగలను. అందుకే ఏ మందూ పుచ్చుకోకుండా వుంటాను" అంది.

"కానీ......" వాక్యం పూర్తి చేయలేదు గణపతి.

"ఆ భయం నాకూ వుంది. అందుకే నా జబ్బు గురించీ, దాని వైద్యం గురించీ విల్లులో ఉదహరిస్తూ యావదాస్తినీ నా తదనంతరం నీకు చెందేలా వ్రాసేశాను. ఆ విల్లు ఆర్నెల్లకు మాత్రమే వర్తిస్తుంది. ఆర్నెల్లు గడిస్తే నాది మళ్లీ నూరేళ్ల జీవితమని నా నమ్మకం" అంది కళ్యాణి.

ఆశ్చర్యానందాలు గణపతి కళ్లలో మెరిశాయి. అతడు అభిమానంగా భార్య వంక చూసి "విల్లెందుకు వ్రాశావు?" అన్నాడు.

"లాయరు కూడా ఇదే ప్రశ్న వేశాడు. నీ భర్తే నిన్ను ఏ యాక్సిడెంటు పేరో చెప్పి చంపేయగలడన్నాడు. నేను చెప్పినా వినకుండా నాది సహజ మరణమయితే తప్ప ఈ విల్లు చెల్లదని క్లాజు చేర్చాడు" అంది కళ్యాణి.

గణపతి సాలోచనగా "నీ జబ్బు గురించి లాయరకూ తెలిసిందన్న మాట" అన్నాడు.

"లాయరుకే ఏమిటి? చుట్టుపక్కల వాళ్లందరికీ కూడా తెలుసు"

గణపతి బుర్ర చురుగ్గా పని చేస్తోంది. అతడి మెదడులో ఓ పథకం రూపు దిద్దుకుంటోంది.

## 3

కళ్యాణీ! మన అదృష్టం పండింది. నా స్నేహితుడొకడు ఆయుర్వేదం ప్రాక్టీసు చేస్తున్నాడు ఈ రోగ లక్షణాలు విని ఆయుర్వేదంలో తిరుగులేని మందు వుందన్నాడు. ఇదిగో - ఈ సీసాలో ఇరవై గోళీలున్నాయి. రోజూ ఉదయం సాయంత్రం ఒకో గోళీ వేసుకోవాలి. వారం రోజుల్లో గుణం కనిపిస్తుంది. పది రోజుల్లో జబ్బు పటాపంచలైపోతుంది" అన్నాడు గణపతి.

కళ్యాణి అతడి నుంచి సీసా అందుకుని, "నాకోసం ఎంతో తపనపడుతున్నావు. కానీ నీ శ్రమంతా వృథా" అని నిట్టూర్చింది.

"నా శ్రమ వృథా కాదు" అనుకున్నాడు గణపతి మనసులో.

చాలా కష్టపడి ఆ మందు గురించి తెలుసుకున్నాడతడు. మనిషిని ఒక్కసారిగా కాక క్రమంగా చంపగల ఆ స్లోపాయిజన్ ప్రయోగం గురించి ఎవరైనా ఫిర్యాదు చేస్తే తప్ప డాక్టర్లుకూడా తెలుసుకోలేరు. అంటే వారం పది రోజుల్లో కళ్యాణికి సహజ మరణం తప్పదు.

కళ్యాణి మందు వేసుకున్న మొదటి రోజునే భర్తతో తన బాధ ఇంకా ఎక్కువయిందని చెప్పి గోలపెట్టింది.

"పెరుగుట విరుగుట కొరకే!" అన్నాడు గణపతి.

రెండో రోజు ఆమె మందు వేసుకుని విలవిలలాడిపోతే గణపతి భయపడ్డాడు కూడా!

మూడో రోజున ఆమె అతడితో "ఇది మందు కాదు, విషం. ఆర్నెల్ల ప్రాణం పది రోజులకే పోతుందని భయంగా వుంది" అని కళ్లనీళ్లు పెట్టుకుంది.

శ్రీ వివేకానంద పబ్లిక్ స్కూల్
ఇంగ్లీష్ మీడియం
సాయి ఎడ్యుకేషనల్ ట్రస్ట్ (రిజిష్టర్డ్) వారిచే నడుపబడుచున్నది
కర్నాటక ప్రభుత్వంచే గుర్తించబడినది
సిరిగుప్ప-583121
కర్నాటక

- బాల బాలికలకు ప్రత్యేక హాస్టల్ గల కో ఎడ్యుకేషన్ పాఠశాల
- షటిల్, టేబుల్ టెన్నిస్, కారమ్స్ వంటి ఆటలకు అనువయిన ఇండోర్ స్టేడియం
- 125 మంది కూర్చునే వీలుగా అత్యంత ఆధునికమైన భోజనశాల
- సి బి ఎస్ ఇ సిలబస్
- రెసిడెన్షియల్ కేరళ అధ్యాపకులచే ప్రత్యేక శిక్షణ
- ప్రవేశద్వారం వద్ద గణేష్ ఆలయం, ప్రార్థనా మందిరంతో 14 ఎకరాల సువిశాలమైన ఆవరణలో వున్న పాఠశాల
- ఎల్.కె.జి నుంచి III వరకు తరగతులు
- అడ్మిషన్లు ప్రారంభమైనవి
- కనీస సంఖ్యతో తరగతులు నిర్వహణ

సంప్రదించండి: కె.సాయిబాబు
కరస్పాండెంట్

TEJA PUB/BACHI

''నా కోసం ఈ బాధ భరించు'' అన్నాడు గణపతి.

అలా వారం రోజులు గడిచేసరికి కళ్యాణికి అన్న హితవు పోయింది. బాధ పెరిగి పోయింది. రాత్రిళ్లుసరిగా నిద్ర పోయేది కాదు. ఆమె తానిక జీవించనన్న భయంతో తన వాళ్లకు కబురు పెట్టింది.

కళ్యాణి తమ్ముళ్లిద్దరు, లత, ప్రకాష్ అక్కడికి వచ్చారు. ఆమె పరిస్థితి చూసి కంగారుపడ్డారు. మందు గురించి వాళ్లకు చెబితే ఇక వేసుకోనివ్వరని ఇంత వరకూ వచ్చేక డోసు పూర్తి చేయడం మంచిదనీ గణపతి చెప్పాడు. అందుకని ఆమె ఆ విషయం వాళ్లకు చెప్పకుండా రహస్యంగా వుంచింది.

వైద్యం ప్రారంభించిన ఆరో రోజుకు కళ్యాణికి కావలసిన వాళ్లంతా వచ్చారు. ఎనిమిదో రోజున ఆమె భర్తతో ''నువ్వు చెప్పింది నిజం. నాకు మందు బాగా పని చేసింది. ఈ రోజు తలనొప్పి లేదు. చాలా హాయిగా అనిపిస్తోంది'' అంది.

ఆరిపోయేముందు పెద్దగా వెలిగే దీపంలా కనబడిందామె గణపతికి. కానీ పది రోజుల వైద్యం పూర్తయ్యే సరికామెలో పూర్వపు టాకలి పుట్టింది. రోగ లక్షణాలన్నీ మాయ మయ్యాయి.

ఆ తర్వాత మరో నాలుగురోజులకు లత తప్ప వచ్చిన బంధువులందరూ వెళ్లి పోయారు. లత భర్త మూడు నెలల పాటు టూర్లో వుండవలసి వచ్చింది కాబట్టి ఆమె స్నేహితురాలికి తోడుగా వుండాలనుకుంది.

## 4

''నువ్వు చెప్పింది నిజం. గణపతి నన్ను చంపాలనుకున్నాడు'' అంది కళ్యాణి.

''ఎలా తెలిసింది?'' అంది లత.

కళ్యాణి ఆమెకు తన జబ్బు గురించి చెప్పి ''గణపతి నా కోసం తెచ్చిన మందును బోనులో ఎలక్కి పెట్టాను మిఠాయిలో కలిపి. మూడు రోజుల్లో చచ్చి ఊరుకుంది'' అంది.

''అయితే నువ్వా మందు వేసుకోలేదా?''

''జబ్బు లేనప్పుడు మందెందుకు వేసుకోవాలి?''

''అయితే వెంటనే జబ్బు తగ్గిందని చెప్పక ఇన్నాళ్లెందుకు నాటక మాడావు?'' అంది లత.

> నేను ఉదయం లేవగానే నిన్నే తలుచుకుంటాను రాధా'' అన్నాడు గోపాలం రాధతో.
>
> ''ఆ క్రిష్ణారావు కూడా ఇలాగే చెప్పాడు'' మురిపెంగా అంది రాధ.
>
> ''అవుననుకో 'కానీ క్రిష్ణారావు నాకంటే లేటుగా లేస్తాడు'' చెప్పాడు గోపాలం.
>
> — చివపత్తిరెడ్డి

''అగ్ని సాక్షిగా పెళ్లి చేసుకున్నాం. కలసే కాపురం చేస్తున్నాం. అతడికి నా మీద రవంతైనా ప్రేమ వుంటుందనుకున్నాను. మందు పుచ్చుకున్నప్పుడల్లా బాధను నటిస్తే అతడి కళ్లలో ఆనందమే తప్ప జాలి వుండేది కాదు. పోనీ మందు మానేయమని ఒక్కసారి కూడా అనలేదు. పైకి మెత్తగా కనిపించినా గణపతి నరరూప రాక్షసుడు'' అంది కళ్యాణి.

లత మాట్లాడలేదు.

''అతడికి నేను మనసిచ్చాను. తనువిచ్చాను. డబ్బిచ్చాను. హోదా విచ్చాను. అడిగిందల్లా ఇచ్చాను. కానీ అతడు నా ప్రాణాలు తీయాలనుకున్నాడు. ప్రేమగా అడిగితే అవీ ఇచ్చేసేదాన్నేమో! కానీ అతడు నన్ను మోసం చేశాడు. నా పట్లచాలా క్రూరంగా ప్రవర్తించాడు.''

''స్లో పాయిజన్‌లో చంపాలనుకుంటే అది క్రూరత్వం కాదు''

''ఆ గోళీలు తిని ఎలుక పడ్డ నరక యాతన చూశాను. ఆ దృశ్యం తలచుకుని నాకు నిద్ర పట్టడం మానేసింది. గణపతిలో క్రూరత్వముందని తెలియగానే నేను భయపడ్డాను. నా జబ్బు తగ్గిందంటే అతడు నన్ను బ్రతకనివ్వడని భయం పుట్టి రక్షణ కోసం మిమ్మల్నందర్నీ పిలిపించుకున్నాను...''

''నువ్వాడిన నాటకం చాలా ప్రమాదకరమైనది...''

''ప్రమాదం నాకేముంది? గణపతికి నేను చూపించిన విల్లు నకిలీది. నా జబ్బు నకిలీది. అతడి ఎదుట నేను వేసుకునే మందు నకిలీది. ఆ ముందుకు నేను పడ్డ బాధ నకిలీది. అసలు బాధ... పాపం... ఈ ఇంట్లో తిండితిన్న నేరానికి ఓ ఎలక పడింది...''

''ఏమైతేనేం? ఆ మందింకా నీ దగ్గరుంది. సాక్షధారాలలో గణపతిని జైలుకు పంపవచ్చు'' అంది లత.

''అతణ్ణి జైలుకు నేను పంపడ మెందుకు? నా ఉసురు పంపుతుంది...''

''అంటే?''

''గణపతికి, సుభద్రకు నేనెప్పుడూ హాని తలపెట్టలేదు. కానీ నాకు జరిగిన హానికి ప్రత్యక్షంగా గణపతి, పరోక్షంగా సుభద్ర బాధ్యులు. అందుకు నా ఉసురు వాళ్లిద్దరికీ తగిలి తీర్తుంది.''

''ఎలా?'' అంది లత.

''నా జబ్బు లక్షణాలన్నీ ఎక్కడివి? సుభద్ర జబ్బు గురించి నీవు చెప్పగా తెలుసుకున్నదే కదా! ఆ లక్షణాలు మా ఫామిలీ డాక్టరుకు చెబితే దానికి సరైన మందు లేదనీ జబ్బు ప్రమాదకరమైనది కాదనీ భరించడం మినహా గత్యంతరం లేదనీ అన్నాడు. గణపతి దగ్గర నేనెంత గొప్పగా నటించానంటే తను తెచ్చిన మందు నిజంగా నా జబ్బు నయం చేసిందనే అతడు నమ్ముతున్నాడు. తన ప్రాణానికి ప్రాణమైన సుభద్ర బాధతో విలవిలలాడినా సరే అతడామెచేత ఈ మందు తినిపిస్తాడు...''

లత తెల్లబోయి ఆమె వంక చూసి, ''అయితే?'' అంది.

''సరైన సమయానికి సుభద్ర రాసినట్లు పోలీసులకుత్తరం అందాలి. రహస్యంగా గుళ్లో పెళ్లిచేసుకున్న తన భర్త తన్ను వదిలించుకునేందుకు బలవంతంగా విషం పెట్టి చంపగలడని అనుమానిస్తున్నట్టుండాలా ఉత్తరంలో...''

''అప్పుడు?''

''సుభద్ర పరలోకంలో... గణపతి కారాగారంలో...''

''నువ్వు సామాన్యురాలివి కాదు...'' అంది లత భయంగా.

''అందుకే సామాన్యుడి ప్రేమకు నేను అందను'' అంది కళ్యాణి.

''నా అన్నయ్య సామాన్యుడు కాదు...'' అంది లత వెంటనే.

''నేను అందేదాకా ఆ విషయం ఋజువు కాదు...''

* * *

సుభద్ర మరణించింది. గణపతి జైలుపాలయ్యాడు. సుభద్ర తన నెందుకనుమానించిందో అర్థం కాక గణపతి సతమతమవుతుంటే తను సామాన్యుడినని ఋజువు చేసుకుందుకు ప్రకాష్ ప్రయత్నిస్తున్నాడు. ●

కోరమాండల్
సిమెంట్స్ లిమిటెడ్ వారి భీమ సిమెంట్